క్లుప్తంగా

ఆయిల్‌పామ్ పంటలు పరిశీలన



పరిశీలిస్తున్న ఫాతిమా సుల్తానా

సోన్: మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం, కూచన్‌పెల్లి, సంగంపేట గ్రామాల్లో శనివారం అయిల్‌పామ్ పంటలను ఉద్యాన వన అధికారి ఫాతిమా సుల్తానా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వరి సాగు చేయడం కన్నా ఆయిల్ పామ్ సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చునని అన్నారు. సోన్ మండల క్లస్టర్ సీహెచ్ భూమయ్య రైతులు ఉన్నారు.

మంత్రి 'వేముల'కు పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా: రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతిచెందారు. శనివారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కుటుంబీకులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. మంజులమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పరామర్శ

కుంటాల: కల్లూర్ మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పరామర్శించారు. మాజీ సర్పంచ్ రమణాగౌడ్ ఉన్నారు.

'సంత్ సేవాలాల్ బోధనలు ఆచరణీయం'

భైంసాటౌన్: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ బోధనలు ఆచరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావుపటేల్ అన్నారు. బాల్ బ్రహ్మచారి గంగేశ్వర్ మహారాజ్(మద్నాపూర్) ఆధ్వర్యంలో కుభీర్ మండలం మార్లగొండ గాలిసింగ్‌తండా నుంచి బాసర వరకు సేవాలాల్ మహారాజ్ పగిడి పాదుకా పల్లకీయాత్ర చేపట్టారు. శనివారం భైంసాలోని ఎస్ఎస్ కాటన్ వద్దకు చేరుకోగా రామారావుపటేల్ పల్లకి మోసి స్వాగతం పలికారు. భక్తులకు ఎస్ఎస్ కాటన్‌లో అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బి.గంగాధర్, వెంగల్‌రావు, ప్రకాశ్‌పటేల్, చక్రధర్‌పటేల్ ఉన్నారు.

పామును చంపిన యువకులు



చనిపోయిన పాము వద్ద యువకులు

ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో శనివారం పాము కలకలం సృష్టించింది. సుమారు 5 అడుగుల పొడవు ఉన్న పామును చూసి స్థానికులు పరుగులు పెట్టారు. పలువురు యువకులు కర్రలతో పామును కొట్టి చంపారు. దీంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

మద్యం పట్టివేత

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామంలోని బెల్ట్‌షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో శనివారం మద్యాన్ని పట్టుకున్నామని ఎస్సై సాయికుమార్ తెలిపారు. వీటి విలువ రూ.15 వేలు ఉంటుదన్నారు. బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వైఎస్సార్‌టీపీ ఖానాపూర్ టికెట్ కోసం దరఖాస్తు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ లోకిని రాము ఆ పార్టీ ఖానాపూర్ అసెంబ్లీ టికెట్ దరఖాస్తు చేసుకున్నాడు. శనివారం హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో గల పార్టీ కార్యాలయంలో దరఖాస్తు ప్రతులను అందజేశాడు.

చీరల విరాళం

నిర్మల్‌టౌన్: దేవీనవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని హరిహరక్షేత్రం మల్లన్నగుట్టలో లలిత పరమేశ్వరి అమ్మవారికి భక్తురాలు గందె జయశ్రీ–సుధీర్ దంపతులు చీరలు, పూజసామగ్రిని విరాళంగా ఇచ్చారు. 9 రోజులకు సరిపడా పూజ సామగ్రి, చీరలను శనివారం ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ–మురళీధర్‌రెడ్డికి అందజేశారు. గురుస్వామి మూర్తి తదితరులు ఉన్నారు.

పల్సిని మండలంగా ఏర్పాటు చేయాలని రిలేదీక్ష

కుభీర్: పల్సి గ్రామాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష కొనసాగింది. శనివారం నాటిని మూడో రోజుకు చేరింది.

9 రోజులు.. 9 రూపాలు

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు
- రోజుకో అవతారంలో అమ్మవారి దర్శనం
- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి



బాగులవాడ దుర్గామాత అమ్మవారు (ఫైల్)



లక్ష్మణచాంద: ముస్తాబైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం

నిర్మల్‌టౌన్: దేవీ శరన్నవరాత్రోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజున మొదలై ఈనెల 23 వరకు జరగనున్నాయి. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. జిల్లా కేంద్రంలోని నందిగుండం దుర్గామాత ఆలయం, హరిహర క్షేత్రం, బంగాల్‌పేట్ మహాలక్ష్మి, బాగులవాడ ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. అధికసంఖ్యలో తరలివచ్చే భక్తులకోసం అధికారులు, నిర్వాహకులు ఏర్పాటు పూర్తి చేశారు. ప్రత్యేకంగా మండపాలను ముస్తాబు చేశారు. మామిడి తోరణాలు వివిధ రకాల పూలతో అలంకరించారు.

రోజుకో రూపంలో..

ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకు ఒక రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. 15న బాలాత్రిపుర సుందరీదేవి, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణదేవి, 18న మహాలక్ష్మీదేవి, 19న లలితా త్రిపురసుందరీ దేవి, 20న సరస్వతి దేవి(మూల నక్షత్రం), 21న దుర్గాదేవి, 22న మహిషాసురమర్దిని దేవి, చివరి రోజైన 23న రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమివ్వనున్నారు.

నాలుగు దశాబ్దాలుగా..

నిర్మల్‌లో నాలుగు దశాబ్దాలుగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బాగులవాడ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో 1981లో మొదటగా దుర్గామాత చిత్రపటం ఉంచి రెండేళ్లు పూజలు చేశారు. తర్వాత 1983లో రెండు ఫీట్ల కర్ర విగ్రహం, 1985 నుంచి ఇప్పటివరకు మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించి అమ్మవారిని చీరలు, ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. బాగులవాడ కాలనీలో సుమారు 500 కుటుంబాలు చిన్నా, పెద్ద తేడా 9 రోజులు ఉపవాస దీక్షలు చేస్తారు.

- పట్టణంలో 19 ఏళ్ల కిందట మర్రి చెట్టు వద్ద వెలిసిన నందిగుండం దుర్గామాతకు భక్తులు పూజలు చేస్తున్నారు. గత 14 ఏళ్లుగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐదేళ్ల క్రితం రూ.1.80 కోట్లతో ఆలయం నిర్మించారు. పట్టణంలో దాదాపు 30 మండపాల్లో అమ్మవారిని కొలుస్తారు.

కొలువుదీరిన స్వామివారు



లక్ష్మణచాంద: మండల కేంద్రంలో అతి పురాతనమైన అష్టభుజ శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ప్రతీరోజు వాహనంలో స్వామివారు రథంపై ఊరేగిస్తారు. భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు.

దుర్గామాత మండపాల అలంకరణ



లోకేశ్వరం: దేవీ శరన్నవరాత్రోత్సవాల కోసం గ్రామాల్లో దుర్గామాత మండపాలను ముస్తాబు చేశారు. ప్రత్యేకంగా అలకరించారు. ఇందుకోసం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేసి సిద్ధంగా ఉంచారు.

అందరి సహకారంతో ఉత్సవాలు



నందిగుండం దుర్గామాత ఆలయంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను అందరి సహకారంతో వైభవంగా నిర్వహిస్తాం. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాం.

– లక్కడి జగన్మోహన్ రెడ్డి, నందిగుండం దుర్గామాత ఆలయ కమిటీ అధ్యక్షుడు

ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



జిల్లాలోనే అతి పురాతనమైన ఆలయం వేణుగోపాలస్వామి. ఇక్కడ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహిస్తారు. కోరిక కోర్కెలు తీరుతాయని వారి నమ్మకం.

– సురకంటి ముత్యంరెడ్డి, సర్పంచ్

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- గడ్చిరోలి ఎంపీ, అశోక్ నేతే



మాట్లాడుతున్న అశోక్ నేతే

కడెం: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని మహారాష్ట్రలోని గడ్చిరోలి ఎంపీ అశోక్‌నేతే ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. ఖానాపూర్, నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఇందులో ఎన్నికల ఇన్‌చార్జి మల్లారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, నాయకులు సట్ల అశోక్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల అధ్యక్షులు కిష్టయ్య, సదాశివ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరికలు

నిర్మల్‌టౌన్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులు చూసే వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని మూన్‌లైట్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గాజులపేట్ కాంగ్రెస్ పార్టీ 21వ వార్డు కౌన్సిలర్ ఇమ్రాన్ ఉల్లా 300 మంది అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు గాజులపేట్ నుంచి ఫంక్షన్‌హాల్ వరకు బైక్‌ర్యాలీగా వెళ్లారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, నాయకులు గౌతమ్‌రెడ్డి, నజీరుద్దీన్, అప్పాల ప్రభాకర్, ఆనంద్ పాల్గొన్నారు.

'రామరాజ్యం రావాలంటే బీజేపీకే ఓటేయాలి'



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

సారంగపూర్: రాష్ట్రంలో రజాకార్ల పాలనపోయి రామరాజ్యం రావాలంటే బీజేపీకే ఓటేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ పిలుపునిచ్చారు. మండలంలోని జామ్ గ్రామంలో శనివారం ఆయన రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కానీ ప్రధాని మోదీ 10 ఏళ్లలో రూ.9 లక్షల కోట్లతో తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. రైతుల కోరిక మేరకు నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టారని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి వయా నిర్మల్ మీదుగా హైదరాబాద్ పటాన్‌చెరువు వరకు వందశాతం కేంద్రం నిధులతో రైల్వే లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఆయన వెంట బీజేపీ చేరికల కమిటీ కన్వీనర్ భూపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విలాస్, పసుపు రైతులు ఉన్నారు.

ముమ్మర తనిఖీలు

భైంసారూరల్: మండలంలోని మాటేగాం సమీపంలో శనివారం పోలీసుల వాహనాల తనిఖీలు కొనసాగాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతీరోజు ప్రధాన మార్గాల్లో తనిఖీలు చేపడుతున్నారు. కార్లు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పీసీలు సునీల్, అశోక్, దిలీప్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని లోకేశ్వరం ఎస్సై సాయికుమార్ అన్నారు. మండలంలోని పంచగుడి వంతెన వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేశారు.

సొంత నిధులతో దుర్గామాత షెడ్డు

- రూ.లక్ష కేటాయించిన డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి
- షెడ్డు నిర్మాణం పూర్తి.. నేడు దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన



నూతనంగా వేసిన దుర్గామాత షెడ్డు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో దుర్గామాత షెడ్డు నిర్మాణానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి తన సొంత నిధులు రూ.లక్ష కేటాయించారు. ఆయన గత రెండేళ్ల క్రితం గ్రామంలో దుర్గామాత వద్ద పూజలు చేశారు. శాశ్వత షెడ్డు నిర్మాణానికి సహకరించాలని ఉత్సవ కమిటీ, వీడీసీ సభ్యులు ఆయన్ను కోరగా సానుకూలంగా స్పందించారు. ఈసారి కమిటీ సభ్యుల కోరిక మేరకు రూ.లక్ష అందించారు. వెంటనే షెడ్డు పనులు చేపట్టి పూర్తిచేశారు. ఆదివారం దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. పొట్టపెల్లి(కె).. తనకు రెండవ సొంత గ్రామమని, ప్రజలపై ఉన్న అభిమానంతోనే రూ.లక్ష అందించినట్లు డీసీసీబీ వైస్ చైర్మన్ తెలిపారు. దుర్గామాత కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళ మేళా



మేళాలో కొనుగోలు చేస్తున్న మహిళలు

నిర్మల్: జిల్లాకేంద్రంలోని ఇంద్రానగర్ ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో కొనసాగుతున్న శ్రీకల్యాణి చేనేత, హస్తకళల మేళా ఆకట్టుకుంటోంది. పండుగ దగ్గర పడుతుండటం, సెలవురోజుల కావడంతో అధికసంఖ్యలో మహిళలు, పిల్లలు కావల్సినవి కొనుగోలు చేస్తున్నారు. తక్కువ ధరల్లో ఎక్కువ వెరైటీలు ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

పూల పండుగ వచ్చేసింది..

- నేడు బతుకమ్మ సంబురాలు
- ఆడిపాడనున్న మహిళలు, యువతులు



కుంసరలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

భైంసా: పూలపండుగ రానే వచ్చేసింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ సంబురాలు ఆదివారం భైంసాలో నిర్వహించనున్నారు. ఈ డివిజన్‌లో 70 శాతానికిపైగా గ్రామాల్లో ఆది, సోమవారాల్లోనే జరగనున్నాయి. శనివారం అమావాస్య రాకతో సంబరాలు మొదలయ్యాయి. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల్లోని తొమ్మిది రోజులపాటు చిన్న పిల్లలు, విద్యార్థులు, యువతులు, మహిళలు వేడుకల్లో పాల్గొనున్నారు. ఏటా గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద మున్నూరుకాపు మిత్రమండలి ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి అల్పాహారం, తాగునీటి ఏర్పాట్లు చేస్తున్నారు.

పూలతో పేర్చి..

మహిళలు తంగేడు, గునుగు, చామంతి, బంతి, రకరకాల పూలతో బతుకమ్మలను పేరుస్తారు. పండుగ సమయంలో బంతిపూల వినియోగం పెరిగింది. దీంతో కిలో బంతిపూలు రూ. 60 నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయి. పూలకొరతతో కాగితపు బతుకమ్మలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

పండుగ సందడి

బతుకమ్మ పండగ వచ్చిందంటే సందడి కనిపిస్తుంది. వివిధ పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడుతాం. చివరి రోజు సామూహికంగా అందరితో కలిసి గడ్డెన్నప్రాజెక్టు వద్ద జలాశయంలో నిమజ్జనం చేస్తాం.

– నవ్యశ్రీ, భైంసా

సంబురాలు జరుపుకొంటాం

బతుకమ్మ అంటే ఎంతో ఇష్టం. ఇంట్లో వారు పువ్వులను తీసుకువచ్చాక బతుకమ్మలను పేర్చి సంబురాలు జరుపుకొంటాం. బతుకు అర్థాన్ని వివరించే పాటలు పాడుతాం. చివరి రోజు పట్టణమంతా ప్రాజెక్టు వద్దే కనిపిస్తుంది.

– తేజశ్రీ, భైంసా

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సాయన్న

లక్ష్మణచాంద: రాష్ట్రప్రభుత్వం దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు పింఛన్ మాదిరిగా కాకుండా గౌరవ వేతనం కింద నెలకు రూ.10 వేలు ఇవ్వాలన్నారు. వారికోసం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాకేంద్రంలో ఈనెల 21న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వోస రవీందర్, మండల అధ్యక్షుడు అరటి శ్రీనివాస్, కార్యదర్శి గంగన్న, సభ్యులు ముత్యం, సాయేందర్, జమాల్, చిన్నయ్య, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



భైంసాటౌన్: ఆల్ఫోర్స్ పాఠశాలలో..



కుభీర్ మండలం పల్సిలోని విద్యాభారతిలో..



దిలావర్‌పూర్‌లో..

బతుకమ్మ సంబరాలు

దిలావర్‌పూర్/భైంసాటౌన్/కుభీర్: బతుకమ్మ సంబురాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చారు. సాయంత్రం ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఒకచోట చేర్చి ఆడిపాడారు. దిలావర్‌పూర్ మండలకేంద్రంలో జరిగిన వేడుకలో యువతులు చిన్నారులు పాల్గొన్నారు. భైంసాలోని ఆల్ఫోర్స్ పాఠశాల, కుభీర్ మండలంలోని పల్సి విద్యాభారతి పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి ఆడి పాడారు. అనంతరం నిమజ్జనం చేశారు.

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు.

ఖానాపూర్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సంక్షిప్తంగా

'ముథోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థిని మార్చాలి'

భైంసాటౌన్: ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి బీఆర్‌ఎస్ బీఫాం ఇవ్వొద్దని భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు అన్నారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శనివారం భైంసాలో మాట్లాడారు. ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని మంత్రి కేటీఆర్‌ను కోరగా, అందరినీ కలుపుకుపోవాలని ఎమ్మెల్యేకు సూచించారన్నారు. కానీ ఎమ్మెల్యే మాత్రం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీంతో పార్టీకి నష్టం వాటిల్లే అవకాశముందన్నారు. ఇప్పటికైనా అభ్యర్థిని మార్చి నష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో మెండె శ్రీధర్, చిన్నారావు, జీవీ.రమణారావు, పండిత్‌రావు, సోలంకి భీంరావు, సాల్లి రమేశ్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు దాతల సహకారం

కుంటాల: మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయురాలు పట్కరి పార్వతి శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. భర్త కిషన్ పక్షవాతంతో బాధపడుతున్నాడు. కనీసం అంత్యక్రియలు నిర్వహించలేని పరిస్థితి. కాగా ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కలిసి రూ.58 వేలు నగదును పోగుచేసి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

తానూరు: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై సందీప్ సూచించారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని పండుగలు మత సామరస్యాన్ని పెంపొందించే విధంగా జరుపుకోవాలన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు చేయాలన్నారు.

విజయోత్సవ సంబురాలు

కుంటాల: ప్రపంచ క్రికెట్ పోటీల్లో శనివారం పాకిస్తాన్ జట్టుపై భారత్ టీం గెలుపొందింది. కుంటాలలోని యువకులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. బస్టాండ్‌లో మిఠాయిలు పంచిపెట్టారు.

నేడు విద్యుత్ అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ రవి ఓ ప్రకటనలో తెలిపారు. బుధవార్‌పేట్, పాత కలెక్టరేట్, పాత బస్టాండ్, ఇందిరానగర్, భాగ్యనగర్, బాగులవాడ, పింజరిగుట్ట, జిల్లా ఆసుపత్రి, పాన్‌గల్లి, బర్కత్‌పురా, చైన్‌గేట్, గొల్లపేట్, విజయనగర్ కాలనీ, కస్బా కాలనీల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

'ఆత్మహత్యల తెలంగాణగా మార్చారు'

భైంసాటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆత్మహత్యల తెలంగాణగా మార్చిందని కాంగ్రెస్ నాయకుడు డా కిరణ్ కొమ్రేవార్ విమర్శించారు. భైంసాలోని తన నివాసంలో శనివారం మాట్లాడుతూ హైదరాబాద్‌లో గ్రూప్–2 అభ్యర్థి ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

తురాటిలో వైద్యశిబిరం

సర్నాపూర్(జి): తురాటి గ్రామంలో కుంటాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ లక్ష్మణ్, ఏఎస్ఎం భవిత పాల్గొన్నారు.

శనీశ్వర ఆలయాల్లో పూజలు



లోకేశ్వరం శివాలయంలోని శని దేవునికి భక్తుల పూజలు

భైంసారూరల్/తానూరు/లోకేశ్వరం/కుంటాల: శనివారం అమావాస్య కావడంతో జిల్లాలోని శనీశ్వర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనీశ్వరునికి నవధాన్యాలు, నూనె, నల్లగుడ్డలు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.